క్లుప్తంగా

వైభవంగా గోదాదేవికి సారె సమర్పణ



గోదాదేవికి సారెను తీసుకువస్తున్న వికాస తరంగిణి బృందం

జంగారెడ్డిగూడెం: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా స్థానిక గోకుల తిరుమల పారిజాత గిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కొలువైన గోదాదేవికి శనివారం సారె సమర్పించారు. కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడు గ్రామ వికాస తరంగిణి భక్త బృందం పసుపు, కుంకుమ, గాజులు, వివిధ రకాల పుష్పాలు, పండ్లు, నూతన వస్త్రాలు, ద్రవ్యాలతో ఘనంగా సారె సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు గోదాదేవికి విశేష పూజలు నిర్వహించి అనంతరం మంగళహారతి సమర్పించారు. అనంతరం భక్తులకు అమ్మవారి గాజులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను ఈవో మానికల రాంబాబు పర్యవేక్షించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ నాయకులు పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు సౌజన్యంతో శనివారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వడ్డీల పేటలోని దీవెన మినిస్ట్రీస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సోమరాజు తల్లి సూర్యవతి వర్ధంతి సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ వార్డు సభ్యులు సూది కొండల శివాజీ గణేష్, మదుతూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పారిజాతగిరివాసుడి సన్నిధిలో...

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామిని ఏలూరు జిల్లా కోర్టు న్యాయమూర్తులు శనివారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో మానికల రాంబాబు, సిబ్బంది న్యాయమూర్తులు మంగకుమారి, సునంద, విజయలకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. న్యాయమూర్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వారికి ఆలయ ప్రధానార్చకులు నల్లూరి రవికుమారాచార్యులు వేద ఆశీర్వాదం, స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదాలు ఇచ్చి సత్కరించారు.

శ్రీవారి సేవలో...



శ్రీవారిని దర్శించుకున్న సినీ నిర్మాత పాండు ప్రసాద్ వర్మ

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయాన్ని సినీ నిర్మాత వేటుకూరి పాండు ప్రసాద్ వర్మ శనివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా శ్రీవేంకటేశ్వరస్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు.

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేయాలి

కామవరపుకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ రమేష్ అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కనికెళ్ల రత్నకుమారి, తమ్మిశెట్టి గిరిజ, ఎంపీడీవో కె.శ్రీదేవి, తహసీల్దార్ డీవీ సత్యనారాయణ, ఈఓపీఆర్‌డీ మరిడియా, గ్రామ సర్పంచులు ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

రసవత్తరంగా ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు



జంగారెడ్డిగూడెం రూరల్: వాలీబాల్ పోటీలను వీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



జంగారెడ్డిగూడెం: వాలీబాల్ పోటీలో తలపడుతున్న యువకులు



కామవరపుకోట: జీలకర్రగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖోఖో ఆడుతున్న యువతులు

జంగారెడ్డిగూడెం రూరల్: గ్రామీణ క్రీడాకారులను వెలికితీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు పలుచోట్ల రసవత్తరంగా సాగుతున్నాయి. జిల్లా పరిషత్ హైస్కూల్ జరుగుతున్న ఈ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మండలంలోని శ్రీనివాసపురం జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా శనివారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జెడ్పీటీసీ బాబ్జి ప్రారంభించారు. ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎంపీడీవో కె. విజయ్ ప్రసాద్, ఎంపీటీసీ జుజ్జవరపు తాతారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల వ్యాప్తంగా పాఠశాలల్లో ఆడుదాం ఆంధ్ర క్రీడాలు పోటీలు జరిగాయి.

జంగారెడ్డిగూడెం: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా స్థానిక సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాలలో శనివారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో నాలుగు సచివాలయాలకు సంబంధించి 16 టీమ్‌లు పాల్గొన్నాయి. వీటిలో నాలుగు టీమ్‌లు విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. అలాగే మహిళలకు సంబంధించి రెండు టీమ్‌లు పోటీ పడగా, ఒక టీమ్ విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, కౌన్సిలర్ మానవత మూర్తి, కమిషనర్ పి.భవానీప్రసాద్, తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎంపీడీవో కె.విజయ్‌ప్రసాద్, పీడీ జయరాజు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

కామవరపుకోట: క్రీడలతో శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం చేకూరుతుందని జెడ్పీటీసీ, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ కడిమి రమేష్ అన్నారు. మండలంలో గుంటుపల్లి పంచాయతీ జీలకర్రగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గ్రామంలోని యువతులు ఉల్లాసంగా పాల్గొన్నారు. ప్రజల ఆరోగ్యంతో పాటు, గ్రామీణ స్థాయి యువత క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమం నిర్వహించడం శుభ పరిణామం అని జెడ్పీటీసీ రమేష్ అన్నారు. యువత ఆటల్లో పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటాలన్నారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపూ



ఎమ్మెల్యే బాలరాజును కలిసిన జశ్వంత్ నాయక్

బుట్టాయగూడెం: పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానాన్ని కల్పించేందుకు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. జిల్లా వికలాంగుల ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బానోతు జశ్వంత్‌నాయక్ శనివారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాలరాజును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. పోలవరం నియోజకవర్గంలో అన్ని విభాగాల్లో ఉత్సాహవంతులైన వారిని నియమించడం జరిగిందని బాలరాజు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అందరూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో సౌకర్యాల కల్పనకు చర్యలు

చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా



చింతలపూడిలో సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాల భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి: సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా శనివారం సందర్శించారు. గురుకుల పాఠశాలలో నిర్మాణంలో ఉన్న మిగిలిన భవనాలను ఆయన పరిశీలించారు. మొత్తం రూ.10.12 కోట్ల వ్యయంతో గురుకుల పాఠశాల భవనాలను నిర్మాణం చేపట్టి ఇటీవల ప్రారంభోత్సవం చేసి విద్యార్థులను నూతన భవనంలోకి తరలించారు. నూతన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఎలీజా ఆదేశించారు. ఇదిలాండగా పాఠశాలలో తాగునీటితో పాటు ఇతర అవసరాలకు నీటి సదుపాయం లేదని ప్రిన్సిపాల్ ఎల్ కిషోర్‌కుమార్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎలీజా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి గురుకుల పాఠశాల భవనాలను పూర్తి చేసినట్లు చెప్పారు.

100 పడకల ఆసుపత్రి పరిశీలన

2019లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి రూ.25 కోట్ల నిధులు విడుదల చేసినట్లు ఎమ్మెల్యే ఎలీజా చెప్పారు. ప్రస్తుతం వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. మెట్ట ప్రాంత ప్రజల వైద్య అవసరాలకోసం ఇంత పెద్ద ఆసుపత్రిని మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని, జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌లకు కతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ పందు జగదీష్, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, పట్టణ సచివాలయాల కన్వీనర్ ఎస్ దుర్గారావు, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఎం.దిలీప్, జంగా చెన్నకేశవరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ఎం.ఇమ్మానియేలు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్ కాంతారావు, మందలపు సాయిబాబు, ముసునూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళను కొట్టిగాయపర్చిన నేరంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: తనకు ఇవ్వాల్సిన డబ్బులు అడిగినందుకు తనను కొట్టి గాయపరిచారని పి.వెంకటలక్ష్మి అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. వివరాల ప్రకారం వెంకటలక్ష్మి చేపల వ్యాపారం చేసుకుంటూ జీవిస్తోంది. ఏడాది క్రితం కంతేటి బాలాజీ అనే వ్యక్తికి రొయ్యలు విక్రయించగా దానికి సంబంధించి రూ.70 వేలు అతడు ఇవ్వాల్సి ఉంది. వెంకటలక్ష్మి డబ్బులు అడుగుతున్నా ఇవ్వకుండా కాలయాపన చేయడమేకాకుండా ఆమెను బాలాజీ, మరోవ్యక్తి జుట్టుపట్టుకుని దుర్భాషలాడుతూ తీవ్రంగా కొట్టినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

స్టీల్‌రాడ్‌ల దొంగతనంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: స్థానిక మార్కండేయపురం టిడ్కో గృహాల వద్ద ఉంచిన స్టీల్ రాడ్‌లను దొంగతనం చేసి తీసుకువెళ్లిపోయారని కాంట్రాక్టర్ షేక్ అబ్దుల రహీమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ట్రైనీ డీఎస్పీ బి.విద్య తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 25న టిడ్కో గృహాల వద్ద సైట్ ఇంజనీర్‌గా పనిచేసే కె.రామకృష్ణ, మరో ఇద్దరు నాగు, కృష్ణ అనే వ్యక్తులు కంపెనీ స్టాంప్‌లతో దొంగ గేట్ పాసులు తయారు చేసి వాటిని సెక్యూరిటీ గార్డుకు చూపించారు. వాటిపై సెక్యూరిటీ గార్డు అనుమానం వ్యక్తం చేసినప్పటికి వారు బెదిరించి 12ఎంఎం, 16ఎంఎం, 10ఎంఎం, 8ఎంఎం సైజుల గల స్టీల్ సుమారు 9 టన్నులు లారీలో తరలించుకుపోయినట్లు కాంట్రాక్టర్ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం రూరల్: యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు లక్కవరం ఎస్సై దుర్గా మహేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బుట్టాయిగూడెం మండలం రామన్నగూడెంకు చెందిన చవల వీరబాబు అనే యువకుడు గొర్రెలను మేపుతుంటాడు. 20 రోజుల క్రితం వీరబాబు తన గొర్రెలను మేపేందుకు జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం వచ్చాడు. ఈనెల 29 వతేదీ ఇంటికి వెళ్లి వస్తానని సహచర గొర్రెల పెంపకందారులకు చెప్పాడు. అయితే అతను ఇంటికి చేరకపోవడంతో తండ్రి సత్యనారాయణ శనివారం లక్కవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం



ఉర్లగూడెంలో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ల భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి: సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యం తీసుకువచ్చారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని ఉర్లగూడెం గ్రామంలో శనివారం గ్రామ సచివాలయాన్ని, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాలను ఎమ్మెల్యే ఎలీజా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కె.యువరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ సచివాలయాల ఏర్పాటు తరువాత పేద గ్రామీణ ప్రజలు ప్రభుత్వ సేవల కోసం జిల్లా, మండల కేంద్రాల చుట్టూ తిరిగే అవస్థలు తప్పాయని అన్నారు. ప్రతి పని గ్రామంలోని సచివాలయంలోనే అందుబాటులోకి వచ్చినట్లు చెప్పారు. ఆర్‌బీకేల ద్వారా రైతు సేవలు, వెల్‌నెస్ సెంటర్లతో ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఎమ్మెల్యే ఎలీజా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, సర్పంచ్ కొండుబోయిన యువరాజు, ఎంపీటీసీలు మల్లేశ్వరరావు, కె.రామారావు, విద్యాసాగర్, మండలంలోని సర్పంచ్‌లు తాండ్ర రామకృష్ణారావు, యడ్ల మోహన్‌రావు, కె.శివరామకృష్ణ, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ యూసుఫ్, ఏఎంసీ మాజీ చైర్మన్ మందలపు సాయిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చింతలపూడి మార్కెట్ కమిటీ పదవీ కాలం పొడిగింపు



ఏఎంసీ చైర్‌పర్సన్ జానకిరెడ్డిని అభినందిస్తున్న దృశ్యం

చింతలపూడి: చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవీ కాలాన్ని 6 నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న పాలకవర్గం పదవీ కాలం ఇటీవల ముగియడంతో ప్రభుత్వం మరో 6 నెలలు పొడిగించింది. దీంతో మూడోసారి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న జగ్గవరపు జానకిరెడ్డిని శనివారం ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, ఏలూరు జిల్లా మోటారు వాహనాల అధికారి కె.విజయరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు ఏఎంసీ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. తనకు మరోసారి అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జానకిరెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

జనవరి 5 వరకు ఓటు నమోదు

టి.నరసాపురం: ఓటరు నమోదు ప్రక్రియ జనవరి 5 వరకు పొడిగించినట్లు తహసీల్దార్ జేవీ సుబ్బారావు తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇటీవలే ఓటరు నమోదు ప్రక్రియ గడువు ముగిందని, ఎన్నికల కమిషన్ ఓటు నమోదు, మార్పులు చేర్పులు పూర్తిస్థాయిలో నిర్వహించే విధంగా గడువును జనవరి 5వ తేదీ వరకు పెంచినట్లు తెలిపారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆన్‌లైన్ ద్వారా గాని, బీఎల్‌వోల ద్వారా గాని ఓటు నమోదు చేసుకోవాలన్నారు. జనవరి 12 వరకు పరిశీలన, 22వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు.

మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారానికి కృషి

కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి వెల్లడి



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్‌లు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: పట్టణంలో అన్ని వార్డుల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి వెల్లడించారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బత్తిన లక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్‌లు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో కోరారు. ఎల్.వెంకటేశ్వరరావు, కంచర్ల గీతాకుమారి తదితరులు మాట్లాడుతూ సాలిపేట రోడ్డు ప్రారంభించి వదిలివేశారని, అలాగే 23, 24 వార్డులకు సంబంధించి డ్రెయినేజీల నిర్మాణం సగంలో నిలిపివేశారని, వెంటనే పూర్తి చేయాలని కోరారు. వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, ఎల్.వెంకటేశ్వరరావు, నేట్రు సుబ్బలక్ష్మి, ఏవీ రమణమూర్తి తదితరులు మాట్లాడుతూ కాలేజ్ వద్ద రెండు రోడ్లు నిర్మాణం పూర్తయ్యాయని, మిగిలిన రోడ్లు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌లను అడుగుతుంటే తమకు బిల్లులు అవ్వడం లేదని పేర్కొంటున్నారని, దీని వల్ల మిగిలిన పనులు నిలిచిపోతున్నాయన్నారు. దీంతో కమిషనర్ పి.భవానీప్రసాద్ మాట్లాడుతూ కాంట్రాక్టర్‌లకు బిల్లులు పెండింగ్ లేకుండా చేస్తామని అయితే బిల్లులు వంక పెట్టుకుని కాంట్రాక్టర్‌లు ఇబ్బందిపెడితే సహించబోమన్నారు. పట్టణంలో పారిశుధ్యం సక్రమంగా లేదని వెంటనే చర్యలు చేపట్టాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ భవానీప్రసాద్, ఆయా శాఖల అధికారులు, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

సమావేశం ఆమోదించిన అభివృద్ధి పనుల వివరాలు

- 24, 11, 26, 13, 20 వార్డుల్లో రూ. 62.70 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి ఆమోదం.
- 20వ వార్డులో రూ.2 లక్షలతో ఆర్‌సీసీ కల్వర్టు నిర్మాణం.
- 21వ వార్డులో రూ.12 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణం.
- మృతిచెందిన ముగ్గురు పారిశుధ్య కార్మికులు ఒకొక్కరికి రూ.2 లక్షల చొప్పున రూ.6 లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లించేందుకు తీర్మానం.
- 3 నెలల పాటు 15 మంది అదనపు పారిశుధ్య సిబ్బందిని నియమించేందుకు, వారి వేతనాలకు రూ.7 లక్షలు చెల్లించేందుకు తీర్మానం.
- రూ.2 లక్షలతో డస్ట్‌బిన్ల కొనుగోలుకు ఆమోదం.
- పట్టణంలో డ్రెయిన్ల పూడికతీతకు రూ.20 లక్షలు వెచ్చించేందుకు తీర్మానం.
- పారిశుధ్య సిబ్బంది సమ్మెలో ఉన్న కారణంగా 21 మందిని రోజువారీ వేతనంపై నియమించి వారికి వేతనాలు రూ.8 లక్షలు చెల్లించేందుకు తీర్మానం.
- ఆడుదాం ఆంధ్ర నిర్వహణకు రూ.1.50 లక్షలు మంజూరు.
- అక్కమ్మ కోనేరు ఆధునీకరణకు అమృత్ పథకంలో రూ.120 కోట్లు మంజూరు కాగా, మున్సిపాలిటీ వాటా కింద రూ.12 లక్షలు వెచ్చించేందుకు తీర్మానం.
- 29వ వార్డులో మంచినీటి ట్యాంకు నిర్మాణం కోసం ఎంపీ నిధులు రూ.50 లక్షలు మంజూరు కాగా, మున్సిపాలిటీ నుంచి మరో రూ.90 లక్షలు, మొత్తం రూ.కోటి 40 లక్షలు వెచ్చించి నిర్మాణం చేసేందుకు తీర్మానం చేశారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

బుట్టాయగూడెం: ఏపీటీఎఫ్ రూపొందించిన 2024 డైరీ, క్యాలెండర్‌ను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ శనివారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ రెడ్డి దొర, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోర్సా సతీష్, బుట్టాయగూడెం మండల శాఖ ప్రధాన కార్యదర్శి తారకం శ్రీను, మడివి శ్రీను, వెట్టి రమణ, కోర్సా ప్రసాద్, జీడెం శిరమయ్య పాల్గొన్నారు.

కామవరపుకోట: ఏపీటీఎఫ్, యూటీఎఫ్ మండల శాఖ 2024 నూతన క్యాలెండర్లను, శనివారం ఎంఈఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ విజయలక్ష్మి మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నాయని అన్నారు. వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజ, కామవరపుకోట సర్పంచ్ కరిపోతు అనూష, ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు ఎస్ఎస్ మహాదేవి, సెక్రటరీ మళ్ళ నాగేశ్వరరావు, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు నల్లమోతుల సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ముగ్గురు భక్తులు వేర్వేరుగా శనివారం రూ.2,89,399 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా రాజమండ్రికి చెందిన తలబత్తుల దిలీప్ వీరవెంకట సుమంత్ రూ.1,11,111, హనుమాన్ జంక్షన్‌కు చెందిన కొత్తూరు సాయిబాలాజీ రూ.78,288, హైదరాబాద్‌కు చెందిన వేటుకూరి పాండు ప్రసాద్‌వర్మ రూ.లక్ష నిత్యాన్నదాన పథకానికి జమచేశారు. దాతలకు ఆలయ సూపరింటెండెంట్‌లు రమణరాజు, రాజు, అన్నదాన సదనం గుమస్తా బన్నీ విరాళం బాండ్ పత్రాలను అందజేశారు.

ఘనంగా ప్రపంచ నేలల దినోత్సవం

చింతలపూడి: ప్రపంచ నేలల దినోత్సవాన్ని రాఘవాపురం హైస్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోండ్రు వజ్రకిషోర్ మాట్లాడుతూ నేలను సంరక్షించుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. తడి పొడి పద్ధతుల్లో పంటలు పండించుకోవడం మేలని పలువురు సూచించారు. ఆరుతడి పంటలు వేసుకోవడం ద్వారా రైతులకు కరెంట్, నీరు ఆదా అవుతాయని, పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరుగుతాయన్నారు. అనంతరం పీఎన్‌పీ కంపెనీ నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ శివ, గ్రామ యానిమేటర్ జయబాబు, పీఎన్‌పీ ఏపీ హెడ్ కీర్తి, జిల్లా ప్రతినిధి ఎస్ వంశీ, రాజు, సుధీర్, హెచ్‌ఎం కె రామకృష్ణ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి



దుర్గాప్రసాద్‌కు రూ.10 వేల చెక్‌ను అందజేస్తున్న పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: వాలీబాల్ పోటీల్లో సత్తా చాటుతున్న గిరిజన విద్యార్థికి ఐటీడీఏ పీవో సూర్యతేజ ప్రోత్సాహక బహుమతి అందజేశారు. పోలవరం మండలం కుంకాల ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పూసం దుర్గాప్రసాద్ రాష్ట్ర స్థాయిలో అరకువాలీలో జరిగిన వాలీబాల్ పోటీల్లో గెలుపొంది జాతీయ స్థాయిలో పోటీలకు ఎంపికయ్యాడు. అనంతరం జాతీయస్థాయిలో భువనేశ్వర్‌లో జరిగిన వాలీబాల్ పోటీల్లో కూడా తృతీయ స్థానంలో గెలుపొంది కాంస్య పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా ఐటీడీఏలో పీఓ ఎం.సూర్యతేజ శనివారం దుర్గాప్రసాద్‌కు ప్రోత్సాహక బహుమతిగా రూ.10 వేల చెక్ అందజేశారు. దుర్గాప్రసాద్‌ను తీర్చిదిద్దిన పీఈటీని పీఓ అభినందించారు. కార్యక్రమంలో ఏపీఓ పీవీఎస్ నాయుడు, పీఎంఆర్‌సీ ఏఎంఓ కె.శిరమయ్య, ప్రధానోపాధ్యాయులు వీర్రాజు, పీఈటీ కన్నపరాజు తదితరులు పాల్గొన్నారు.